సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



ధర్మపురిలో మహిళల కోలాటాల మధ్య నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య



కోరుట్లలో నిమజ్జనం అవుతున్న గణనాథుడు

న్యూస్‌రీల్

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఆహ్వానం



ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాలలో జరిగే పలు అభివృద్ధి పనులకు రావాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆహ్వానించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి అక్టోబర్ 3న మంత్రి కేటీఆర్ వస్తున్నారని, ఆ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రావాలని కోరారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో గురువారం కలిసి ఆహ్వానించారు. కార్యక్రమాలకు వస్తానని మంత్రి తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత



నిండుకుండలా ఎస్సారెస్పీ

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లను గురువారం మూసివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 17,318 క్యూసెక్కుల నీరు వస్తోంది. కాకతీయ మెయిన్ కెనాల్‌కు 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 200 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 300 క్యూసెక్కులు, వరద కాలువకు 10 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ 152 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసాపత్రాలు



పత్రాలతో ఆర్టీసీ ఉద్యోగులు, డీఎం

కోరుట్ల: ఆర్టీసీ కోరుట్ల డిపోలో పని చేస్తున్న ఉద్యోగులకు 2023 ప్రగతి చక్రం అవార్డులను డిపో మేనేజర్ విజయమాధురి గురువారం అందించారు. డ్యూటీలో ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భం డీఎం మాట్లాడుతూ కండక్టర్లు, డ్రైవర్లు ఇదే స్ఫూర్తితో పోటీపడాలన్నారు. మిగతా సిబ్బంది కూడా అవార్డులు గెలుచుకోవాలని, ఆర్టీసీకి ఆదాయం సమకూర్చాలని కోరారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ జీపీ.సింగ్, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మన్ ఐఆర్‌కే.రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మహేందర్ రెడ్డి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

ధర్మపురి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి సహకారం సంఘంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. సంఘం లావాదేవీలు, జమ, ఖర్చులు, రైతుల పంటరుణాలపై చర్చించారు. పంటల సాగుకు తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని, మళ్లీ తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ చిట్టిబాబు, సంఘం ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు, పాలకవర్గ సభ్యులు, సీఈవో రాజేశ్ పాల్గొన్నారు.

రంగపేటలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని రంగపేటలో వినాయకుడికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గురువారం పూజలు చేశారు. టైగర్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి మండపం వద్ద అన్నప్రసాద వితరణలో పాలుపంచుకున్నారు. ఎంపీటీసీ మాలెపు విమల, ఉపసర్పంచ్ రామడుగు రవి, యువజన సంఘం నాయకుడు జక్కుల సాయి తదితరులు పాల్గొన్నారు.



చిన్న గణపతితో చిన్నారి



జగిత్యాల టవర్ వద్ద గణనాథుడి శోభాయాత్ర



బొజ్జగణపతితో యువతి

మళ్లీ రావయ్యా..

నవరాత్రుల పాటు భక్తుల విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. జిల్లా కేంద్రంలో రెండోరోజు కూడా నిమజ్జనం ఘనంగా జరిగింది. సుమారు 450 వినాయకులను నిమజ్జనం చేశారు. కన్నులపండువగా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో టవర్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోలీ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పాల్గొన్నారు. ధర్మపురిలో భారీ విగ్రహాలను క్రేన్‌ల సాయంతో రాయపట్నం గోదావరిలో, మిగిలిన విగ్రహాలను ధర్మపురి బోయలు ఏర్పాటు చేసిన బల్లకట్టుపై విగ్రహాలను దించి గోదావరిలో నిమజ్జనం చేశారు. శోభాయాత్రను మంత్రి ఈశ్వర్ ప్రారంభించారు.

– జగిత్యాలటౌన్/ధర్మపురి



జగిత్యాలలో నిమజ్జనం చేస్తూ..



కోరుట్లలో నిమజ్జనం చేస్తున్న చిన్నారులు



కోరుట్లలో గణపయ్యకు వీడ్కోలు పలుకుతున్న భక్తులు



గణనాథుడికి వీడ్కోలు పలికేందుకు సిద్ధమైన మహిళలు



జగిత్యాలలో గణపయ్యకు చివరి పూజలు



జగిత్యాల చింతకుంట చెరువులో నిమజ్జనం చేస్తున్న సిబ్బంది



శోభాయాత్రను వీక్షిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ..



కోరుట్లలో నిమజ్జనం చేస్తున్న చిన్నారులు



గణపయ్యకు పూజలు చేస్తున్న మంత్రి కొప్పుల



ధర్మపురిలో చిన్నారుల ఉత్సాహం



చిన్నిచిన్న గణపతులతో చిన్నారులు



టీచర్ల ర్యాంకుల్లో గోల్‌మాల్!

జీహెచ్‌ఎం పదోన్నతుల్లో కొన్ని పొరపాట్లు

సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
734	75	చూపించలేదు
736	182	158
743	217	175
762	300	194

బదిలీలు (గణిత ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు

జిల్లా	సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
జగిత్యాల	02	675	2,163
జగిత్యాల	25	685	2,191
జగిత్యాల	31	334	681
సిరిసిల్ల	01	430	507
సిరిసిల్ల	02	221	568
సిరిసిల్ల	06	683	751

- 317 జీవో టైంలో ఒకలా, పదోన్నతులు, బదిలీల్లో మరోలా!
- పొరపాటైతే సవరణకు, స్కాం అయితే విచారణకు టీచర్ల డిమాండ్
- తప్పుడు సీనియారిటీ చూపించినవారి పదోన్నతి రద్దు
- 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆర్జేడీ ఆదేశాలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

విద్యాశాఖ చేపట్టిన పదోన్నతులు, బదిలీలు వివాదాస్పదమవుతున్నాయి. ఇటీవల జీహెచ్‌ఎం బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన విద్యాశాఖ కమిషనర్ దేవసేన చర్యలు తీసుకోవాలని డీఈవోలను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇది మరవరకముందే.. మరిన్ని వివాదాలు విద్యాశాఖను చుట్టుముడుతున్నాయి. ఓవైపు పదోన్నతులు, బదిలీల్లో అనేక పొరపాట్లు, తప్పులు దొర్లుతున్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అనేక సందేహాలు వ్యక్తమయ్యేందుకు కారణమవుతోంది. తాజాగా నిర్మల్ డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఓస్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ లేకున్నా.. పదోన్నతి పొందిన విషయమై ఆర్జేడీకి బాధిత టీచర్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి, పొరపాటు గ్రహించిన అధికారులు పదోన్నతి రద్దు చేసి, అర్హుడైన ఉపాధ్యాయుడికి పదోన్నతి కల్పించారు. సీనియారిటీలో వెనకబడి ఉన్నా.. పదోన్నతి ఎలా వచ్చిందో 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని సదరు టీచర్‌ను ఆర్జేడీ ఆదేశించారు.



జగిత్యాల డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

పదోన్నతుల్లో ప్రామాణికం..

2021లో 317 జీవో అమలులో భాగంగా పలువురు టీచర్లను సీనియారిటీ ఆధారంగా వివిధ జిల్లాలకు కేటాయించారు. అప్పుడున్న లిస్టులో డీఎస్సీ ర్యాంకులు స్థానికత నిర్ధారణలో కీలకంగా వ్యవహరించాయి. తాజాగా బదిలీలు, పదోన్నతుల్లోనూ అధికారులు వాటిని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అయితే, చాలా జిల్లాల్లో ఈ ర్యాంకులు 317 జీవో సమయంలో ఒకలా, ప్రస్తుతం మరోలా ఉండటం చూసి తోటి టీచర్లు అవాక్కవుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల్లో ర్యాంకులకు, 317 జీవో సందర్భంగా జరిగిన కేటాయింపుల సమయంలో ఉన్న ర్యాంకుల్లో వ్యత్యాసాలు ఎందుకు వచ్చాయి? అన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కరీంనగర్, పెద్దపల్లికి సంబంధించిన బదిలీల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకున్నా.. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మాత్రం టీచర్ల ర్యాంకుల విషయంలో గతానికి, ప్రస్తుతానికి భారీ వ్యత్యాసాలు వెలుగుచూశాయి. దీనిపై అర్హులైన ఉపాధ్యాయులంతా అభ్యంతరం తెలియజేస్తూ.. తప్పులు సవరించాలని డీఈవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఉన్నతాధికారులు ఏం చెబుతారో?

317 జీవో అమలు సందర్భంగా స్థానికత విషయంలో టీచర్లకు అనేక చిక్కులు ఎదురయ్యాయి. ఆ సమయంలో డీఎస్సీ ర్యాంకులను కూడా ప్రామాణికంగా తీసుకుని జిల్లాలకు కేటాయించారు. తాజా పదోన్నతులు, బదిలీలకూ అవే కీలకం. ఈ రెండింటిలో భారీ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోన్న వేళ.. ఏ ర్యాంకులు నిజం? అన్న ప్రశ్నకు ఉన్నతాధికారులు సమాధానమివ్వాల్సి ఉంది. ఒకవేళ 317 బదిలీల్లో ఉపయోగించిన ర్యాంకులే పొరపాటైతే.. జిల్లాలకు జరిగిన టీచర్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగి ఉంటాయని టీచర్లు అనుమానిస్తున్నారు. లేదా ప్రస్తుతం పదోన్నతులు, బదిలీల్లో చూపించిన ర్యాంకుల్లో తప్పులు ఉంటే.. సవరించి న్యాయం చేయాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉద్దేశపూర్వకంగానే తప్పుడు వివరాలిచ్చారా?

317 జీవో సమయంలో విద్యాశాఖ టీచర్ల ర్యాంకులు పొందుపరిచింది. తాజా పదోన్నతులు, బదిలీల్లో మాత్రం హెచ్‌ఆర్‌ఎంఎస్ వెబ్‌సైట్‌లో స్వయంగా నమోదు చేసుకున్న ర్యాంకులను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అందువల్ల ఈ పొరపాట్లు, వ్యత్యాసాలు తలెత్తుతున్నాయని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలు నమోదు చేసిన టీచర్లపై, సదరు సమాచారాన్ని ధ్రువీకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ప్రజల దీవెనలతో మరోసారి గెలుస్తాం



రాజారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

- ఆశీర్వాద యాత్రలో మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: ప్రజల దీవెనలతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకొస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురితోపాటు మండలంలోని రాజారం, దమ్మన్నపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆశీర్వాదయాత్రలో పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాజారంలో రూ.కోటితో చేపట్టే సీసీరోడ్లు, రూ.10లక్షలతో మున్నూరుకాపు, మాదిగ సంఘాల భవనాలకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని, చేసిన పనులే బీఆర్ఎస్‌ను తిరిగి గెలిపిస్తాయని పేర్కొన్నారు. ఏ గ్రామంలో చూసినా విద్య, వైద్యం, తాగునీరు, సీసీరోడ్లు, నిరంతర విద్యుత్ కనిపిస్తోందని తెలిపారు. ఆశీర్వాద యాత్ర ద్వారా ప్రజలను నేరుగా కలుసుకునే భాగ్యం కల్గిందని వివరించారు. మహిళలు బతుకమ్మలు, మంగళ హారతులతో స్వాగతం పలకడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న దమ్మన్నపేట సర్పంచ్ పులిశెట్టి మల్లేశంను పరామర్శించారు. రాజారంలో ముస్లిం యువకులు బీఆర్ఎస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు భీమన్న, సర్పంచులు బండారి లహరిక, జైనా పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేశ్, వక్ఫ్‌బోర్డు సభ్యుడు సయ్యద్ ఆసిఫ్ ఉన్నారు.

ధర్మపురిని తీర్చిదిద్దుతాం

ధర్మపురిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొప్పుల అన్నారు. పట్టణంలో రూ.25 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులను ప్రారంభించారు. మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన ధర్మపురికి రూ.150కోట్లకు పైగా నిధులను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని తెలిపారు. రానున్న రోజుల్లో ధర్మపురి రూపురేఖలు పూర్తిగా మారుతాయని పేర్కొన్నారు.

ఉద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్
- కథలాపూర్‌లో ఆశావర్కర్ల దీక్షకు మద్దతు

కథలాపూర్(వేములవాడ): ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్ అన్నారు. కథలాపూర్‌లో ఆశావర్కర్ల రిలే నిరాహారదీక్షకు గురువారం సంఘీభావం తెలిపారు. కరోనా సమయంలో ఆశావర్కర్ల సేవలు అమోఘమని, అలాంటివారికి వేతనాల విషయంలో ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల వేళ కొత్త పథకాలు ప్రకటించడం.. కల్లిబొల్లి హామీలు ఇచ్చి మోసం చేయడం రివాజుగా మారిందన్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ.అజీం, కథలాపూర్, భీమారం మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నరేశ్‌రెడ్డి, నాయకులు హరిప్రసాద్, తేలు బాషా, కల్లెడ గంగాధర్, వెలిచాల సత్యనారాయణ, లింగంగౌడ్, ఆకుల సంతోష్, ధనుంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

క్లుప్తంగా

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు వేగవంతం చేయాలి



ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల : జిల్లాకేంద్రంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. గురువారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, సమీకృత మార్కెట్‌ను పరిశీలించారు. అక్టోబర్ 3న మంత్రి కేటీఆర్ రానున్నారని, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు సంపత్, రహమాన్, డీఈ మిలింద్, రాజేశ్వర పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు

మెట్‌పల్లి: పట్టణంలోని ఓ వ్యక్తి ఇంటిపై దాడికి పాల్పడిన బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బొడ్ల రమేశ్‌తోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రమేశ్‌కు తన ఇంటి పక్కన నివాసం ఉండే విద్యాసాగర్‌గౌడ్‌తో ఓ స్థలం విషయంలో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మరో నలుగురితో కలిసి అతని ఇంటికి వెళ్లి, గొడవ చేశాడు. ప్రహరీని కూల్చగా బండరాళ్లు విద్యాసాగర్‌గౌడ్ తల్లిపై పడటంతో ఆమె కాలికి గాయాలయ్యాయి. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

20 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్

కథలాపూర్: మండలంలోని గ్రామాలకు 20 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పైపుల ద్వారా ట్యాంకులకు నీరు చేరకపోవడంతో నల్లాలు రావడంలేదని ప్రజాప్రతినిధులు అంటున్నారు. దీంతో కనీస అవసరాలు తీర్చుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 20రోజులుగా సమస్య ఉన్నా.. అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని మండిపడుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ అనిల్ వివరణ ఇస్తూ.. వేములవాడ శివారులో పంపులు పనిచేయకపోవడంతో మండలానికి నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. వీలైనంత త్వరగా మరమ్మతు చేయిస్తామన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- ఒకరికి తీవ్ర గాయాలు

జగిత్యాల క్రైం: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన అంబటి శంకర్ గురువారం ఉదయం బైక్‌పై జగిత్యాలకు వస్తున్నాడు. జగిత్యాల అర్బన్ మండలంలోని పెర్కపల్లి చౌరస్తా వద్ద జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తల, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రుణాలిస్తాం రండి..!

- పోటీ పడుతున్న బ్యాంకులు
- జిల్లాలో ఈ ఏడాది రూ.5,147 కోట్ల రుణాలు
- గతేడాదితో పోల్చితే రూ.503.45 కోట్లు అదనం



జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలో రైతాంగానికే కాకుండా ఇతర రంగాలకు సైతం విరివిగా రుణాలిచ్చేందుకు బ్యాంకులు పోటీ పడుతున్నాయి. జిల్లా ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంతో, ఆర్థికంగా మరింత వృద్ధి చెందేందుకు రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. బ్యాంకుల వద్ద ఆర్థిక వనరులు పుష్కలంగా ఉండటంతో వడ్డీ వ్యాపారుల కంటే తక్కువ వడ్డీకే రుణాలిచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ రంగానికే 71.86 శాతం రుణాలు ఇవ్వనున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులు నిర్మించే వైద్యులకు ఇచ్చేందుకు ఎక్కువ పోటీ పడుతున్నారు. పెద్ద ఖాతాదారులైతే వారి ఇళ్లకే వెళ్లి, సంతకం పెడితే చాలు, రుణం ఇస్తామని చెబుతున్నాయి. ఈసారి గతేడాది కంటే రూ.503.45 కోట్లు అదనంగా రుణాలివ్వాలని బ్యాంకర్లు నిర్ణయించారు.

గతేడాది రూ.4,644 కోట్లు

జగిత్యాల జిల్లాలో గతేడాది రూ.4,644.17 కోట్ల రుణాలిస్తే, ఈ ఏడాది(2023–24)కి గాను రూ.5,147.62 కోట్లు ఇవ్వాలని ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా బ్యాంకర్ల సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యంగా, జగిత్యాల వ్యవసాయాధారిత జిల్లా కావడంతో రైతాంగానికి విత్తనం వేసేటప్పటి నుంచి పంట కోతకు వచ్చే వరకూ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలు ఇవ్వనున్నారు. అలాగే, వ్యవసాయ బావులు తవ్వుకునేందుకు, పైపు లైన్లు వేసుకునేందుకు, భూమిని సాగుకు అనుకూలంగా మార్చేందుకు, ఆధునిక యంత్రాల కొనుగోలుకు, పండ్ల తోటలు సాగుకు, పాడి పశువులు, కోళ్లు, చేపల పెంపకం, విత్తనోత్పత్తి, అగ్రి ప్రాసెసింగ్ వంటి వాటికి.. అగ్రి టర్మ్ లోన్ల పేరిట రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రుణాలిస్తున్నారు. వ్యవసాయ రుణాల కింద 1.87 లక్షల మంది రైతుల కు రూ.3,698.91 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో, కేవలం పంట రుణాల కిందనే రూ.2,117.96 కోట్లు ఇవ్వనుండటం గమనార్హం.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహాకి రూ.1,086 కోట్లు

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రుణాల కింద 30,632 మందికి రూ.1,086.87 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. వీరిలో వీధి వ్యాపారులు, దుస్తులు, కిరాణ, సూపర్ మార్కెట్ వంటి వారికి ఈ రుణాలు ఇస్తున్నారు. రోజు, నెల, మూడు, ఆరు నెలలు, ఏడాదికోసారి తిరిగి చెల్లించేలా బ్యాంకర్లు ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు చెల్లించే వ్యాపారులకు వారి క్రెడిట్ స్కోర్‌ను బట్టి మరింత రుణం ఇస్తామని చెబుతున్నారు.

ఇతర రంగాల వారికీ..

జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో ఉన్నత విద్య కోసం అమెరికా, ఇంగ్లండ్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్లేవారికి బ్యాంకులు రుణాలిస్తున్నాయి. ఈ ఏడాది రూ.34 కోట్ల వరకు ఎడ్యుకేషన్ లోన్లు ఇవ్వాలని నిర్ణయించారు. చాలా మంది దుబాయ్ వంటి గల్ఫ్ దేశాలతోపాటు అమెరికా వంటి దేశాల్లో ఉపాధి కోసం వెళ్లి, స్వగ్రామాల్లో రూ.కోట్ల విలువైన బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇలాంటివారికి సైతం రూ.100 కోట్ల వరకు రుణాలివ్వాలని నిర్ణయించుకున్నారు. మిగతా వారికి రూ.162.40 కోట్లు ఇవ్వనున్నారు. అలాగే, అంతగా ప్రయారిటీ లేని రంగాలకు సైతం రూ.199 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు.

అవసరమైన వారికి రుణాలు



అవసరమైన వారికి రుణాలు తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా ఇస్తున్నాం. తీసుకున్న అప్పు చెల్లిస్తూ ఉంటే అదనంగా ఇస్తున్నాం. బ్యాంకు నిబంధనల మేరకు అర్హతలు ఉన్నవారికి ఎలాంటి ఆలస్యం చేయకుండా రుణాలిస్తాం.

– వెంకట్ రెడ్డి, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్

తాటిపల్లి మృతులకు అంత్యక్రియలు

- స్నేహితులు కావడంతో ఒకేచోట నిర్వహణ
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు
- గ్రామంలో విషాదఛాయలు



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్



కార్తీక్ (ఫైల్)



రవితేజ (ఫైల్)

జగిత్యాల క్రైం: ఆ తల్లిదండ్రులకు కుమారులంటే ఎంతో ప్రేమ.. ఇరు కుటుంబాల్లో ఇద్దరు కూతుళ్ల తర్వాత జన్మించారు.. దీంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు.. కానీ, రోడ్డు ప్రమాదం వారిని బలి తీసుకోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లికి చెందిన యువకుల అంత్యక్రియలు గురువారం ముగిశాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం.. తాటిపల్లికి చెందిన జెట్టి రాజిరెడ్డి–మల్లవ్వ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు కార్తీక్(18) సంతానం. కుమార్తెలిద్దరికీ వివాహాలు కాగా, కొడుకు ఇంటర్ పూర్తి చేసి, ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన మోకర్తి శంకరయ్య–రాజు దంపతులకూ ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు రవితేజ(17) ఉన్నారు. కూతుళ్లకు పెళ్లిళ్లు చేశారు. కుమారుడు జగిత్యాలలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. కార్తీక్, రవితేజ స్నేహితులు. ఈ క్రమంలో బుధవారం రాత్రి జగిత్యాలలో వినాయక నిమజ్జనం చూసేందుకు బైక్‌పై వెళ్తుండగా చల్‌గల్ శివారులోని రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను చూసిన మృతుల తల్లిదండ్రులు కొడుకులారా.. మా కళ్లముందు నుంచే పోతిరి కదరా.. ఇంతలోనే ఏమైందిరా.. మమ్మల్ని విడిచి ఎలా వెళ్లారురా అంటూ గుండె పగిలేలా రోదించారు. కార్తీక్, రవితేజల అంత్యక్రియలను ఒకేచోట నిర్వహించగా ఎమ్మెల్యే సంజయ్ పాల్గొని, మృతుల కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఇస్రో సైంటిస్టుగా సిరిసిల్ల కుర్రాడు

- తిరువనంతపురంలో నియామకం
- విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై మక్కువ



తల్లిదండ్రులు సుధారాణి–రాజేశంలతో సుశాంత్‌వర్మ

సిరిసిల్ల: సిరిసిల్ల చిన్నోడు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)లో సైంటిస్టుగా నియామకమయ్యారు. సిరిసిల్లకు చెందిన మంచికట్ల సుశాంత్ వర్మ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో సైంటిస్టుగా ఉద్యోగం సాధించారు. సుశాంత్‌వర్మ ప్రాథమిక విద్య కరీంనగర్ కేంద్రీయ విద్యాలయంలో పూర్తి చేశారు. వివేకానంద కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేశారు. బీటెక్ పూర్తికాగానే సుశాంత్‌వర్మ మెరిట్ విద్యార్థిగా ఇస్రోలో సైంటిస్టుగా ఉద్యోగం సాధించాడు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థలో సైంటిస్టుగా నియమితులైన సుశాంత్‌వర్మ చిన్నప్పటి నుంచి పరిశోధనలపై ఆసక్తి కనబరిచేవారు. సుశాంత్ తల్లి సుధారాణి బోయినపల్లి మండలం వర్దవెల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుండగా.. తండ్రి రాజేశం సిరిసిల్ల మున్సిపల్ మెప్మా విభాగంలో కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. సుశాంత్‌వర్మ సైంటిస్టుగా ఇస్రోలో ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు సుధారాణి, రాజేశం గురువారం సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ముస్తాబైన ఎస్పీ కార్యాలయం

- వచ్చేనెల 3న మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభం
- పనులు పర్యవేక్షిస్తున్న పోలీసు హౌసింగ్ కార్పొరేషన్



జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం

జగిత్యాలక్రైం: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం పనులు తుదిదశకు చేరాయి. వచ్చే నెల మూడో తేదీన మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభించేందుకు పోలీస్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. మిగిలిన ఉన్న పనులు పోలీస్ హౌసింగ్‌బోర్డు పర్యవేక్షణలో యుద్ధప్రతిపాదికన కొనసాగుతున్నాయి.

20.25 ఎకరాల్లో నిర్మాణం

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సత్వర సేవలందించాలనే ఉద్దేశంతో 11 అక్టోబర్ 2016న కొత్త జిల్లాలను ప్రారంభించిన విషయం తెల్సిందే. అన్ని జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా కలెక్టరేట్, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. జగిత్యాల ధరూర్ క్యాంప్‌లో 20.25 ఎకరాల్లో ఎస్పీ కార్యాలయాన్ని చేపట్టారు. 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు అక్టోబర్ 3న జిల్లాకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రానున్న నేపథ్యంలో అదే రోజు ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశారు.

ముమ్మరంగా కొనసాగుతున్న పనులు

జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో నిర్మిస్తున్న నూతన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం పనులు 10నెలలుగా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దీంతో ఇప్పటికే పోలీసు ప్రధాన కార్యాలయ పనులు 90 శాతం పూర్తి కాగా, మిగతా పనులకు కూడా యుద్ధప్రతిపాదికన చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ కార్యాలయం రంగులతోపాటు, ముందున్న మైదానాన్ని చదును చేశారు. ప్రధాన ద్వారాన్ని సిద్ధం చేశారు. పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణలో ఉన్న ఏఆర్ కార్యాలయంతోపాటు, ఎస్పీ క్యాంప్ కార్యాలయం పనులు కూడా పూర్తి చేశారు. ఫర్నీచర్ వస్తే కార్యాలయాల్లో సిద్ధం చేయనున్నారు.

ప్రారంభానికి సిద్ధం



జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం పనులు పూర్తిగా పోలీసు హౌసింగ్‌బోర్డు పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. పనులు దాదాపు పూర్తికావచ్చాయి. అక్టోబర్ 3న మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభించేలా పనులు కొనసాగిస్తున్నాం.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

అభివృద్ధిపై చర్చకు రెడీ

- బండి సంజయ్ సవాల్ స్వీకరిస్తున్నాం
- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్



మాట్లాడుతున్న చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్: సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విసిరిన సవాల్‌కు తాము సిద్ధంగా ఉన్నామని, తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తామని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని భాగ్యలక్ష్మి, కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయాలలో ఎక్కడైనా.. ఎప్పుడైనా చర్చకు సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. నాలుగేళ్లలో ఎంపీగా పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి ఏమిటో వెల్లడించాలని కోరారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాత ఒక్కరోజు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో లేరన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులుగా ఎంపిక చేస్తామని డబ్బుల వసూళ్లకు పాల్పడటంతోనే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించారన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, కెమసారం తిరుపతి, తుల భాస్కర్‌రావు, గాలి రవియాదవ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో కోరుట్ల అగ్రగామి

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు
- వినాయకుల బహుమతుల ప్రదానం



జూనియర్ కాళాశాల మైదానంలో జన సందోహం



మొదటి బహుమతి పొందిన భగత్ ఫ్రెండ్స్ యూత్



ద్వితీయ బహుమతి పొందిన వరాహ యూత్



తృతీయ బహుమతి పొందిన గోడలవాడ యువసేన

కోరుట్ల: కోరుట్ల పట్టణాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలో గణనాథుల నిమజ్జనం సందర్భంగా అందంగా అలంకరించిన వినాయక శకటాలకు బహుమతులు అందజేశారు. నిమజ్జనోత్సవం శకటాలను ఒకేచోట చేర్చి మున్సిపల్ ఆధ్వర్యంలో బహుమతులు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఉత్తమ శకటాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, కమిషనర్ రాజేశ్వర్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, పలువురు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, మండపాల నిర్వాహకులున్నారు.

నిమజ్జనంలో ఉద్రిక్తత

- ఎస్సై దాడిచేశారంటూ దళితుల ధర్నా
- ఐదు గంటలపాటు నిలిచిన వాహనాలు
- సంఘటన స్థలానికి చేరిన డీఎస్పీ
- జగిత్యాల జిల్లా అల్లీపూర్‌లో ఘటన



గాయపడిన బత్తుల వెంకటేశ్



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ



ధర్నా నిర్వహిస్తున్న దళిత సంఘం నాయకులు

రాయికల్(జగిత్యాల): గణపయ్య నిమజ్జనం సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లో గురువారం ఉదయం ఉద్రిక్తత చోటుచేసుకుంది. అల్లీపూర్‌లో నెలకొల్పిన వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు యువజన సంఘాలు బుధవారం రాత్రి నుంచి సిద్ధమయ్యారు. గురువారం ఉదయం 5.30 గంటల వరకు శోభాయాత్ర చేపట్టారు. విషయం తెలుసుకున్న రాయికల్ ఎస్సై అజయ్‌కుమార్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని త్వరగా నిమజ్జనం చేయాలని మంటప నిర్వాహకులను కోరారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారికి నచ్చజెప్పినా వినకపోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈ క్రమంలో వెంకటేశ్ అనే భక్తుని కాలుకు గాయం అయింది. తనపై ఎస్సై అకారణంగా దాడి చేశారని ఆరోపిస్తూ వెంకటేశ్ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి 10.30 గంటల వరకు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరీఫ్‌ఖాన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. తమపై దాడిచేసిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకారులు రోడ్డుపై బైటాయించారు. డీఎస్పీ ఆందోళనకారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గాయపడిన వెంకటేశ్‌ను పోలీసులు తమ వాహనంలో జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయపై ఎస్సైని వివరణ కోరగా బుధవారం సాయంత్రం నుంచి శోభాయాత్ర చేపట్టారని, ఉదయం ఆరుగంటలు దాటుతుండడంతో నిమజ్జనం త్వరగా చేయాలని నిర్వాహకులను కోరగా తమనే దూషించారని తెలిపారు. దీంతో అక్కడే బందోబస్తులో ఉన్న తమ సిబ్బంది యువకులను చెదరగొట్టే ప్రయత్నం చేయగా.. వెంకటేశ్ కిందపడి గాయపడ్డాడని తెలిపారు. తాము ఎవరిపైనా దాడి చేయలేదన్నారు.

పిడుగుపాటుకు ముగ్గురికి గాయాలు

కోరుట్ల: పిడుగుపడి, ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన చిన్ని, అంజి, గోపి అనే యువకులు గురువారం సాయంత్రం ఒక్కచోట చేరి, మాట్లాడుకుంటున్నారు. గాలిదుమారం వచ్చి, వీరికి సమీపంలోనే పిడుగు పడటంతో ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దొంగతనం వేధింపులు భరించలేక హత్య



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి(వేములవాడ): దొంగతనం చేస్తున్నావని తరచూ వేధించడాన్ని తట్టుకోలేకనే బాలుడు(17) పులి గంగారంను హత్య చేశాడని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. చందుర్తి సీఐ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. హోటల్ పని చేసుకుని జీవించే గంగారం మంగళవారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని ఓ షట్టర్ ముందు నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన బాలుడు బండరాయితో మోది హత్య చేశాడు. అనుమానం రాకుండా ఉండేందుకు గ్రామంలోని ఓ ప్రజాప్రతినిధి భర్తకు ఫోన్‌చేసి షట్టర్ ముందు ఎవరో పడిపోయి ఉన్నాడని తెలిపాడు. నిందితుడైన మైనర్‌ను అరెస్టు చేసి, వరంగల్‌లోని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ వివరించారు.